శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# అన్నదాతకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యం



**ఆత్మకూరు, నవంబర్7, ప్రభాతవార్త** :ఆరుగాలం వ్యవసప్రయాసలకోర్చి వ్యవసాయాన్ని సాగుచేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టారని, , కేంద్ర, రారష్ట ప్రభుత్వాల సహకారంతో రైతులకు పెట్టుబడిసాయం కింద నగదు అందజేసి వారిని ఆదుకుంటున్నారని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి 5వ విడత డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా పిఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేద రైతులను ఆదుకునే లక్ష్యంతో ప్రవేశపెట్టిన రైతు భరోసా నగదువరుసగా 5వ ఏడాది వారి ఖాతాల్లో జమచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జగనన్న నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో రైతన న్నలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని అధికారంలోకి వచ్చిన అనంతరం రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని ఇందులో ప్రధానంగా పెట్టుబడి సాయం కింద రైతు భరోసానగదు అందజేయడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 5వ విడతలో 53.55లక్షల మంది రైతన్నల ఖాతాల్లో 2,205కోట్ల నగదును అందజేశారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 38,086 మంది రైతులకు 15.4కోట్ల నగదు జమైందన్నారు. ఇందులో సొంత భూమి కలిగిన రైతులకు 37,898 మంది రైతులకు, 15.16కోట్లు, కౌలు భూములు కలిగిన 176మంది రైతులకు 28.80లక్షలు , దేవాదాయ భూమిలో చేసుకుంటున్న 12మంది రైతులకు 1.60లక్షల కోట్లు వంతున నగదు విడుదల చేశారన్నారు. మండలాల వారీగా ఆత్మకూరు మండలంలో 7149 మంది రైతులకు 29కోట్లు, అనంతసాగరం మండలానికి 6103 మందికి 2.5కోట్లు, అనుమసముద్రంపేట మండలానికి 5687 మందికి 2.3కోట్లు, మర్రిపాడు మండలానికి 7739మందికి 3.1కోటి, సంగం మండలానికి 4300మంది రైతులకు 1.8కోట్లు, చేజర్ల మండలానికి 7078మందికి 2.9కోట్లు వంతున నిధులు మంజూరయ్యాయన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసి రానున్న దీపావళి పండుగ ముందుగానే అన్నదాతకు ముందస్తు పెట్టబడి నిధిని అందించిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డికి నియోజకవర్గ రైతాంగం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయండి

**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** వైసీపీ ప్రభుత్వం ఇప్పటివరకు వ్యవసాయరంగంలో రైతులకు ఎంత ఖర్చు పెట్టిందో దమ్ముంటే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యలయంలో సోమిరెడ్డి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్ళలో రూ.1.75లక్షల కోట్లు ఖర్చు పెట్టిందని పచ్చి అబద్ధాలు చెపుతున్నారని, అది ఎలా ఉందంటే నా కుటుంబానికి గతంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి విదేశాల్లో వెయ్యికోట్ల ఆస్తులున్నట్లు చూపిన డాక్యుమెంట్లలా ఉన్నాయని ఆరోపించారు. రైతుల కోసం ఖర్చు చేసింది కేవలం రూ.36వేలకోట్ల లోపేనన్నారు. ధాన్యం కొనుగోలు, ఇతర పంటల కొనుగోలు గత ప్రభుత్వ ధాన్యం సేకరణ బకాయిలు కలిపి రూ.67.596కోట్లు ఖర్చు పెట్టి రైతులకు సాయం చేశామని గొప్పలు చెపుతున్నారని మండిపడ్డాడు. ఆ ధాన్యాన్ని ప్రభుత్వం ఎఫ్‌సీఐకి విక్రయించి డబ్బులు తీసుకోలేదాని,లేక కృష్ణా, గోదావరి, పెన్నా నదుల్లో కలిపేసిందాని ప్రశ్నించారు. రైతుల వద్ద క్వింటాలకు అదనంగా 20కిలోల వరకు ధాన్యం తీసుకోవడంతోపాటు అర్నెల్లకు కూడా నగదు చెల్లించకుండా సాయం చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ, గత ప్రభుత్వ బకాయిలు, పగటిపూట 9గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా, అక్వారైతులకు సబ్సిడీ కలిసి రూ.56.861 ఖర్చు చేసినట్లు చూపుతున్నారన్నారు. ఇది పచ్చి అబద్ధమన్నారు. ఎన్టీఆర్ హయాంలో రోజుకు 18గంటలు కరంటు సరఫరా చేసి ఏడాదంగా కలిపి హార్స్‌పవర్‌కు రూ.50మాత్రమే వసూలు చేశారని తెలిపారు. ఆ తరువాత వచ్చిన అన్ని ప్రభుత్వాలు ఉచిత కరంటు పథకాన్ని కొనసాగిస్తున్నాయన్నారు. వైసీపీ వచ్చాక రోజుకు 9గంటల సంగతి దేవుడెరుగ, కనీసం 4గంటలు సరఫరా లేదని సోమిరెడ్డి ఆరోపించారు. కరంటు కోసం ఖర్చుపెట్టానని చెపుతున్న వేలకోట్లలో షిరిడీసాయి, అదాని కంపెనీలకు దోచిపెట్టడం తప్ప రైతులకు ఒరగబెట్టిందేమీ లేదని చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆక్వా కరంటు ఛార్జీలను యూనిట్ రూ.7వరకు పెంచి రైతులను నిలువునా జగన్ ముంచేశాడన్నారు. రాష్ట్రంలో డిస్కంలకు ప్రభుత్వం రూ.78వేలకోట్లు బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం మొత్తంగా రూ.11లక్షల కోట్లు అప్పుచేసిందన్నారు. ఈ అప్పంతా ఎవరు కడతారని ఆయన ప్రశ్నించారు. అప్పులన్నీ రానున్న టీడీపీ చెల్లించాల్సి వస్తుందన్నారు. జగన్ సొంత కంపెనీలనించి చెల్లిస్తాడాని ప్రశ్నించాడు. డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలను కేంద్ర ప్రభుత్వమే 60శాతం నిధులిస్తుందన్నారు. ప్రజల సొత్తును కోట్లు ఖర్చుపెట్టి పచ్చి అబద్ధాలు ,చెప్పే సీఎం ఇప్పటి వరకు చూడలేదన్నారు. జగన్, కాకాణిలకి ఏ మాత్రం రైతులకి న్యాయం చేయాలని ఉన్నా వారికోసం ఖర్చు పెట్టిన వివరాలను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల్లో అమలవుతున్న అనేక వ్యవసాయ పథకాలను ఈ రాష్ట్రంలో నిలిపేశారని వివరించారు. ఒక్కో జగన్ సభకు ప్రజల ధనాన్ని రూ.40 నుంచి రూ.50 కోట్లు ఖర్చుపెట్టడంతోపాటు పేపర్లలో తప్పుడు ప్రకటనలు ఇస్తారాని చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులను పచ్చిమోసం చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించాలని లేకపోతే వ్యవసాయం చేసుకునే పరిస్థితి పూర్తిగా ఉండదనే భయాన్ని ఆయన వ్యక్తంచేశారు.

# చిరు జల్లులకే ప్రమాదకరంగా మారిన తుమ్మలపెంట రోడ్డు

**కావలి రూరల్, నవంబరు 7 ప్రభాతవార్త** చిరు జల్లులకే కావలి తుమ్మలపెంట రోడ్డులోని పెద్దపెద్ద గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా తయారైంది. ఏది రోడ్డో, ఏది గుంతో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదానికి గురవుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికి తుమ్మలపెంట రోడ్డు జలమయమైంది. రోడ్డులోని గుంతల్లో వర్షపు నీరు చేరింది. ఇక్కడ రోడ్డు వుందా అన్నట్లుగా తయారైంది. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు, పాదాచారులు ఈ రోడ్డు దుస్థితి చూసి ఇదేమి ఖర్మరా బాబూ అంటు లబోదిబోమంటున్నారు. గతంలో ఈ మార్గంలో అనేక యాక్సిడెంట్లు జరిగి కొంత మంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్న సందర్భాలు కూడా వున్నాయి. ఈ రోడ్డు దుస్థితిపై ప్రతిపక్ష పార్టీలు ప్రధాన అజెండాగా చేసుకొని ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఎన్ని ఆందోళనలు,నిరసనలు చేసినా పాలకుల్లో, అధికారుల్లో చీమకుట్టినట్లుగా లేదని ప్రజలు, వాహనదారులు దుయ్యబడుతున్నారు. టిడిపి నాయకులైతే ఈ రోడ్డుపై నిరసన ప్రదర్శనలు చేసి రోడ్డులోని గుంటలలో దొర్లాడి పాలకుల తీరును ఎండగట్టారు. ఇక వాహనదారులైతే ఈ రోడ్డుని బాగుచేయండి మహాప్రభూ అంటూ ఈ రోడ్డు దుస్థితిని చూపిస్తూ వీడియోలు, సెల్ఫీలు తీసి సోషల్ మీడియాలో పెట్టి ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. ఈ విధంగానైనా ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డుకు మోక్షం గలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేకంగా కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తుమ్మలపెంట రోడ్డు గురించి మాట్లాడారు కూడా. నిన్న సిపియం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర కావలికి వచ్చిన సందర్భంగా సిపియం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు ముఖ్యంగా తుమ్మలపెంట రోడ్డుపైనే మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడం కూడా జరిగింది. వీరే కాకుండా కావలికి వచ్చిన రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ రోడ్డు గురించి ప్రస్తావించకుండా వెళ్లే వారు కాదు. ఇంత రాద్ధాంతం చేస్తున్న ఈ రోడ్డు వల్ల అధికార పక్షానికి రానున్న ఎన్నికలలో నష్టం వాటిల్లుతుంది అన్నా కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వుండటం అర్ధం కావడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఏ అధికారిని అడిగినా ఎస్టిమేషన్ పంపాం ఇదిగో బాగుపడుతుంది, అదిగో బాగుపడుతుంది అని గత నాలుగు సంవత్సరాలుగా చెబుతున్నారే తప్ప ఈ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. తుమ్మలపెంట రోడ్డు గుండా ఎక్కువ గ్రామాలకు, రామాయపట్నంపోర్టుకు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు, సముద్ర తీరానికి వాహనాలు వెళ్తుంటాయి. ఈ రోడ్డు దుస్థితి చూసి ప్రక్కదారులకు వెళ్తున్నారు. ఇంత అధ్వానంగా వున్న తుమ్మలపెంట రోడ్డు బాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఐసీడీఎస్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా శిశు సంరక్షణ దినోత్సవం




**నెల్లూరు టౌన్, నవంబర్ 17, ప్రభాతవార్త** ఐసీడీఎస్, ఐసీపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో శిశు సంరక్షణ దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి హాజరై మాట్లాడారు. శిశు సంరక్షణ అనేది తల్లి గర్భంలో నుండే ప్రారంభం అవ్వాలని తెలియజేస్తూ మొదట గర్భంలో శిశువు ఏర్పడినప్పుడు పోషకాహారాన్ని తీసుకోవాలి. 3వ, 4వ నెలలో పిండం పెరుగుదల మొదలవుతుంది. అలాగే 5వ, 6వ నెలలో బ్రెయిన్ డవలప్‌మెంట్, మజిల్స్ డవలప్‌మెంట్ మొదలవుతుంది. 7,8,9వ నెలలో శిశువు గ్రోత్‌కు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని అవగాహన కల్పించారు. 9వ నెలలో శిశువుకు బ్రెయిన్, శరీరం డవలప్‌మెంట్ ఉంటుంది. కాబట్టి ఆ టైమ్‌లో తల్లి చేసే ప్రతి శబ్దాన్ని గమనిస్తూ ఉంటారు. వీలైనంత వరకు 9వ నెలలో తల్లి ప్రశాంతమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపటానికి ప్రయత్నించాలని అవగాహన కల్పించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారాణి బి.హేనసుజన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ నెల 7న శిశు సంరక్షణ దినోత్సవం జరుగుతుందని తెలిపారు. తల్లి బిడ్డను జన్మించిన తర్వాత శిశువును ఎలా సంరక్షించాలి అనే విషయం పై మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువును పరిశుభ్రమైన క్లాత్‌తో చుట్టి తల్లికి దగ్గరగా ఉంచాలి. అలాగే పుట్టిన ఒక గంట లోపు తల్లి పాలు తాగించాలి. ఈ ముర్రుపాలు అనేది మొట్టమొదటి వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తాయని అవగాహన కల్పించారు. 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని, 6 నెలల తరువాత తల్లిపాలుతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలని అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, సీజేడబ్ల్యూజీ ఐ.శ్రీనివాసులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అన్నపూర్ణ, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# కావలిలో ఎడతెరపి లేకుండా వర్షం

**కావలి, నవంబరు 7 ప్రభాతవార్త** కావలి పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే వుంది. దీంతో పట్టణంలోని రోడ్లు వర్షపు నీటితో నిండాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలువలు చెత్తాచెదారాలతో నిండిపోయి వుండటంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్డు మీద ప్రవహించాయి. మురికినీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లి ప్రజలు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే గత కొన్ని నెలలుగా వర్షాలు లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత మేరకు ఉపశమనం కలిగినట్లయింది. రైతులు కూడా వర్షానికి సంతోషం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనులలో నిమగ్నమవుతున్నారు.

# రెండవ విడత వైయస్సార్ రైతు భరోసా రూ.90.55 కోట్లు విడుదల





**నెల్లూరుఅర్బన్, నవంబరు7 ప్రభాతవార్త** జిల్లాలోని రైతులకు రెండవ విడత రైతు భరోసా కింద రూ.90.55కోట్ల రూపాయిలను మంగళవారం ఉదయం సత్యసాయి జిల్లా పుటపర్తిలో రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేయగా, నెల్లూరులో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ యం. హరినారాయణన్ జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ దోడ్డంరెడ్డి నిరంజన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏ రాష్ట్రంలో లేని విదంగా ప్రభుత్వం రైతుల ఖాతలకు నగదు జమచేస్తుందన్నారు. వ్యవసాయానికి మేలు జరిగేలా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి రైతులకు రైతు భరోసా అందిస్తున్నట్లు చెప్పారు. ఎదైనా కారణంతో నిధులు జమకాని రైతులు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం జిల్లాలో రైతు భరోసా నమూనా చెక్కులను రైతులతో కలసి ఆవిస్కరించారు ఎమ్మెల్సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు అతి కీలకమైన పథకం రైతు భరోసా అని, వ్యవసాయ ఖర్చులకు పెట్టుబడి సాయంగా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం రైతు భరోసా పిఎం కిసాన్ నగదు అందజేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ. 1474 కోట్ల రూపాయలు రైతు భరోసా కింద ఆందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల మంది రైతులకు రెండో విడత రైతు భరోసా..పిఎం కిసాన్ నగదు రూ. 90.55కోట్లు నేరుగా రైతుల ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేసినట్లు ఎమ్మెల్సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కోన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుదాకర్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది, రైతులు పాల్గోన్నారు.

# ముంపు ప్రాంతాలను పరిశీలించిన మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 7 ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని 30వ డివిజన్‌లోని శ్రామికనగర్ పరిసర ప్రాంతాలను నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ గతంలో వరదల కారణంగా ముంపునకు గురై ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడే వారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ముంపు పరిసర ప్రాంతాలను స్థానిక కార్పొరేటర్ ప్రసాద్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కమల్, స్థానిక నాయకులతో కలిసి పర్యటిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ ప్రసాద్‌తో పాటు స్థానికులు చెప్పిన సమస్యలను పరిష్కరించాలని, ప్రజలను అప్రమత్తం చేసి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇదివరకే తొమ్మిది లక్షల రూపాయలతో వాగు పూడిక తీత పనులు చేపట్టారని తెలిపారు. రానున్న రోజుల్లో వర్షాల వల్ల నగర ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు. అధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతలో ఓటుపై అవగాహన కల్పించేలా చర్యలు



**కోవూరు, నవంబరు7 ప్రభాతవార్త** : కోవూరు నియోజకవరనగ పరిధిలోని డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల్లో యువతకు ఓటుపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కోవూరు ఎన్నికల ప్రత్యేక అధికారి , నుడా వైస్ ఛైర్మన్ బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి పర్మినెంట్‌గా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, మృతిచెందిన వారి ఓట్లను తొలగించే విషయంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా చేపడుతున్నామన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న బీఎల్‌వోలు దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నూతనంగా ఓటు నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 9 వరకు అవకాశం ఉందన్నారు. అనంతరం ఆయన కంప్యూటర్‌లో ఓటు నమోదుకు సంబంధించిన పలు వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు ఎం. పద్మజ, సీహెచ్ సుబ్బయ్య, పద్మావతి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ సుధా, తదితరులు ఉన్నారు.

# రెవెన్యూ లక్ష్యాలను సాధించడానికి కృషి చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 7 ప్రభాతవార్త** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, కుళాయి పన్ను, డ్రైనేజి పన్ను, కమర్షియల్ భవనాల బకాయిల పన్ను, యూజర్ ఛార్జిల వసూళ్లకు సచివాలయాలకు నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ సచివాలయాల అడ్మిన్, శానిటేషన్, అమెనిటీస్ కార్యదర్శులను ఆదేశించారు.నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగం, ఆరోగ్యశాఖ అధికారులతో స్థానిక కస్తూరిబా కళాక్షేత్రంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ఆలస్యంగా హాజరైన సచివాలయాల సచివాలయాల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని కమిషనర్ హెచ్చరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రెవెన్యూ, కుళాయి పన్ను, యూజర్ ఛార్జీలు వసూళ్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పురోగతిని పర్యవేక్షిస్తానని తెలిపారు. రానున్న మూడు నెలల్లో బకాయిలు పెండింగ్ లేకుండా అన్ని రకాల పన్నులను పూర్తి స్థాయిలో వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పన్నులు బకాయిలు ఉన్న వారికి అత్యవసర సర్వీసులు నిలుపుదల చేయాలని, అలాగే నోటీసులు జారీ చేసి నిర్దేశించిన గడువులోగా వసూళ్లను పూర్తి చేయాలని, సచివాలయాలకు నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను అందుకొని కార్పొరేషన్ ఆదాయం పెంచి నగర అభివృద్ధికి కార్యదర్శులు అందరూ కృషి చేయాలని కమిషనర్ సూచించారు. కుళాయి పన్నుల వసూళ్ల చాలా తక్కువ శాతంగా ఉందని మొండి బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేసి మంచినీటి కనెక్షన్లు తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. ఆస్తి పన్ను, కుళాయి పన్నుల వసూళ్లు సచివాలయాల అడ్మిన్, అమెనిటీస్ కార్యదర్శుల బాధ్యత అని, బాధనయతలను క్రమశిక్షణగా నిర్వర్తించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని నెలరోజుల్లో పురోగతి చూపాలని కమిషనర్ సూచించారు. మొండి బకాయిలు ఉన్న బకాయిదారుల వద్దకు వసూళ్ల నిమిత్తం తన దృష్టికి తీసుకొస్తే ప్రత్యక్షంగా హాజరవుతానని కమిషనర్ స్పష్టం చేశారు. యూజర్ ఛార్జీలు, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. కార్యదర్శులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయాల స్థాయిలో పరిష్కరించలేని సమస్యలను పరిస్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజయ్, చంద్రయ్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రసాద్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయా కార్యదర్శులు పాల్గొన్నారు.

# జగనన్నకు చెబుదాం అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**నెల్లూరుఅర్బన్, నవంబరు7 ప్రభాతవార్త** జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను స్వతరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ హరినారాయణన్,జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్,ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డితో కలసి ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని తహశిల్దార్‌లతో సమావేశమై ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో,గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వివిద భూ సమస్యలపై మండలాల వారీగా వచ్చిన ధరఖాస్తులు వాటి పరిష్కారానికి తీసుకున్న,తీసుకోవలసిన చర్యలపై క్షుణ్ణంగా సమీక్షించి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో నోషనల్ ఖాతాలు, చుక్కల భూములు, సాదా బైనామా, సిజెఎఫ్ఎస్ లబ్దీదారులకు డికేటి పట్టాల పంపిణీ తదితర వివిధ భూ సమస్యలపై వచ్చిన అర్జీలపై సంబదిత మండలాల తహశిల్దార్‌లు ప్రత్యేక ధృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సాదా బైనామా అర్జీలను సరైన కారణం లేకుండా తిరస్కరించడం తగదన్నారు. ప్రజల అవసరాలను తీర్చడంలో భాద్యతగా పనిచేయాలన్నారు.ఆదే విదంగా సాగుబడిలో వున్న భూములకు అర్హతల మేరకు హక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 15వ తేదిన భూ పంపణీ కార్యక్రమం వున్నందున ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలోని ప్రతి సచివాయలం వారీగా గ్రామ సభల్లో భూమి లేని నిరుపేదలనుండి వచ్చిన ధరఖాస్తుల వివరాలను వెంటనే పంపాలని జిల్లా కలెక్టర్ తహశిల్దార్‌లను ఈ సందర్భంగా ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా రెవెన్యూ సమస్యల పూర్తి వివరాలను సేకరించి నిబందనల మేరకు త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తహశిల్దార్‌లను ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి పూర్తి స్థాయిలో భూ సమస్యలు పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్.డి.ఓ.కె.మధులత, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడి హనుమాన్ ప్రసాద్, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహశిల్దార్‌లు, సర్వేయర్‌లు,ప్రజా ప్రతినిధులు వున్నారు.





నెల్లూరు నగరంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. రోడ్లుపై వర్షపునీరు ప్రవహించింది. వర్షంలో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నందా మాల్యాద్రి



































# ఆశయం ఘనం-అమలులో విఫలం

## పోకూరులో అడ్రసులేని ప్రాధమిక ఆరోగ్యకేంద్రం
## మండల కేంద్రానికి పరిమితమవుతున్న డాక్టర్లు

**వలేటివారిపాలెం నవంబరు 7, ప్రభాతవార్త** మారుమూల ప్రాంతాలుకు సైతం వైద్యసేవలు విస్తరించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి మరొక కొత్త పీహెచ్‌సీని మంజూరు చేశారు .ఇందులో బాగంగానే వలేటివారి పాలెం మండలానికి కొత్త (పీహెచ్‌సీ) ప్రాధమిక ఆరోగ్యకేంద్రం మంజూరైంది.మండలానికి తూర్పు ప్రాంతంలోని కలవళ్ల,నలదలపూరు, కొండారెడ్డిపాలెం ,శింగమనేనిపల్లె,కొండారెడ్డిపాలెం,కాకుటూరు,నూకవరం,శాఖవరం, బడేవారిపాలెం, అత్తంటివారిపాలెం,నలదలపూరు తదితర ప్రాంతాల ప్రజలకు మండల కేంద్రమైన వలేటివారి పాలెం సుదూరంగా ఉండడంతో గత 30ఏళ్లగా ఈ ప్రాంత ప్రజలు ఈ ఆరోగ్యకేంద్రానికి వచ్చి ఓపీ చూయించుకున్న దాఖలాలు లేవు.దీంతో స్దానిక ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సూచనలతో ఈ గ్రామాలకు సౌకర్యవంతంగా ఉండెందుకు మండలం నడిబొడ్డున గల పోకూరుకు ఈ కొత్త వైద్యశాలను మంజూరు చేసింది.తూర్పుప్రాంతంలోని 7 సచివాలయాలను వాటి పరిధిలోపనిచేసే క్షేత్రస్దాయి వైద్యసిబ్బందిని పోకూరు పీహెచ్‌సీ కేటాయించారు.ఇద్దరు డాక్టర్లును,ఒక సూపర్‌వైజర్‌ను,మరొక ఆరోగ్య విస్తరణాధికారిని నియమించారు.అయినప్పటికిని పోకూరులో ఆరోగ్యకేంద్రాన్ని నిర్వహించకపోవడంతో వీరంతా మండల కేంద్రానికి పరిమితమైనారు.

ఆశయం ఘనం –ఆచరణలో విఫలం:
ముఖ్యమంత్రి ఆశయము ఘనమైనప్పటికిని ఆచరణలో విఫలం అవుతుంది.రెండేళ్ల కిందట ఆరోగ్యకేంద్రాన్ని ఇద్దరు డాక్టర్లుని,ఇతర సిబ్బందిని ప్రభుత్వం మంజూరు చేసినప్పటికిని భవన వసతి లేదన్న కారణంగా ఆరోగ్యకేంద్రాన్ని పోకూరులో నిర్వహించడం లేదు.ఆరోగ్యకేంద్రానికి స్దలసేకరణ చేశారు. భవననిర్మాణాలకి నిధులు మంజూరై, నిర్మాణం పూర్తివలంటే చాలా కాలం పడుతుంది.అప్పటి దాకా పోకూరులో వైద్యశాల నిర్వహణకు అనువైన పంచాయతీ భవనం ఖాళీగా ఉంది.లేదా నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం,లేదంటే ఏదేని ప్రైవేటు భవనం తీసుకోవచ్చు.ఆ దిశగా ఆలోచించే నాధుడే లేదు.పాలకులు అశ్రద్ద,అధికారులు నిర్లక్ష్యం, గ్రామనాయకులు తమకెందుకులే అని వదిలేయ్యడం తదితర కారణాల వలన ఈ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందడంలేదు.దీంతో డాక్టర్లు, సిబ్బంది అంతా మండల కేంద్రానికి పరిమితమైనారు.ఒక డాక్టరైతే ఏకంగా నెల్లూరుకి డిప్యూటేషన్‌పై వెళ్లారు.కనీసం నాడీ చూసేనాధుడే లేరు.

**ఎమ్మెల్యేకి విజ్ఞప్తి:** పోకూరులో ఆరోగ్యకేంద్ర నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల గుండెల్లో సుస్దిరస్దానం సంపాయించడానికి జగనన్న వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.అయితే ఇక్కడ మాత్రం అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఆయన ఆశయం నిర్వీర్యం అయిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.దాదాపు 20వేల మంది జనాబా వైద్యసేవలు కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు.ఈ గ్రామాల పరిధిలో ఎక్కడా ఎంబిబిఎస్ డాక్టర్ లేరు.వీరంతా కాలునొచ్చినా,కన్నునొచ్చిన కందుకూరు పట్టణానికి పరుగెత్తుతుంటారు.కూలీనాలీ చేసుకొనే రైతలంతా వైద్యశాలల చుట్టూ రోజులు తరబడి తిరుగుతున్నారు.అయినా కేటాయించిన వైద్యులు, సిబ్బంది మండల కేంద్రానికి పరిమిత ౕమైనారు.దీంతో ఈ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి రాలేదు.పోకూరుకి కేటాయించిన ఇద్దరు డాక్టర్లు ఇక్కడే అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాల్సి ఒదిగా పలువురు కోరుతున్నారు.

**అధికారి వివరణ:** పోకూరులో పీహెచ్‌సీ కార్యకలాపాలు నిర్వహించడానికి తగిన ఆదేశాలు తమకు అందలేదలేదని డిప్యూటీ డీఎమ్అండ్‌హెచ్‌వో ప్రియంవద అన్నారు.పోకూరు ఆరోగ్యకేంద్రంకు ఇద్దరు డాక్టర్లు, సూపర్‌వైజర్, విస్తర ణాధి .కారిని నియమించిన మాట వాస్తవమే.అయితే పోకూరు కేంద్రంగా పనిచేయమన్న ఉత్తరువులు తమకు అందలేదన్నారు.దీనితో మూరుమూల ప్రాంతాలకు వైద్యసేవలు అందించడంలో ఉన్నతాధికారులు డొల్లతనం చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లమవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.ప్రభుత్వం ఆరోగ్యకేంద్రం మంజూరు చేసి, ఇద్దరు డాక్టర్లును,ఇతర అదికారులను కేటాయించి, జీతభత్యాలు చెల్లిస్తునా ్న సంబందిత అధికారిణి పై విదంగా వ్యాఖ్యానించడం 'దేవుడు వరమిచ్చినా పూజారి అనుగ్రహించలేదన్న' చందంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.



## ఇరిగేషన్ నిధుల కేటాయింపులో బహిరంగ చర్చకు సిద్ధమేనా




**బిట్రగుంట, నవంబరు 7 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్ళలో ఇరిగేషన్ శాఖ అభివృద్ధికి ఎంత నిధులు వచ్చాయి, ఏ మేరకు పనులు చేపట్టారు, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో నాలుగన్నరేళ్ళ కాలంలో ఎంత నిధులు మంజూరయ్యాయి, ఏ మేరకు పనులు జరిగాయన్న విషయాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుకి వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు సవాల్ విసిరారు. బోగోలు మండల వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు డిఆర్ ఛానల్‌ని పరిశీలించి డిఆర్ ఛానల్ అభివృద్ధి పనుల్లో 20 కోట్ల రూపాయల నిధుల్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్వాహా చేసేందుకు సిద్దమయ్యారని ఆరోపించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టిడిపి హయాంలో ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరు చేయించి పనులు చేయకుండానే నీరు-చెట్టు పథకాలకు సంబంధించి నిధులు స్వాహా చేసిన ఘనత మాలేపాటి సుబ్బానాయుడుకే దక్కుతుందని ఆరోపించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో రైతుల శ్రేయస్సు దృష్టా ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టారని తెలిపారు. దీనిపై బహిరంగ చర్చకైనా, నిజనిర్ధారణ కమిటీ ద్వారా విచారణ జరిపినా తాము సిద్ధమేనని ధీమా వ్యక్తం చేశారు. సుబ్బానాయుడు తన ఉనికిని కాపాడుకునేందుకు పసలేని ఆరోపణలు తమ పార్టీపైన, ఎమ్మెల్యేపైన చేయడం సరైంది కాదన్నారు. ఈ నెల 9వ తేదిన కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్లు, మేధావులు, ఇంజనీర్లు, విద్యావంతులతో వైసిపి నేతల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారని అదే రోజు కావలి జెండా చెట్టు నుండి బయలుదేరే ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ సాధికారికత బస్సు యాత్రలో మండలంలోని వైసిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాగులవరం సొసైటీ అధ్యక్షులు సుంకే మాల్యాద్రినాయుడు, పార్టీ సీనియర్ నేతలు తుపిరి పెంచలయ్య, తుమ్మల రమణయ్యనాయుడు, ఉప్పాల మాచర్ల, కర్తం సురేంద్రరెడ్డి, మేకల శ్రీనివాసులు, షమీవుల్లా, మేకల సాల్మన్‌రాజు, ఆకుల డేవిడ్‌పాల్, సూరపనేని శ్రీనివాసులు, కోతల ప్రసాద్, నిర్మల్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు ఎ.కె.సుందర్‌రాజ్, మల్లి మోహన్, కోఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులకు సి.వి.రామన్ మార్గదర్శకులు




**కావలి, నవంబరు 7 ప్రభాతవార్త** నేటి విద్యార్థులకు సి.వి.రామన్ మార్గదర్శకులని డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. కావలి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సి.వి.రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థులకు, ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి సుధీర్‌నాయుడు మాట్లాడారు.సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్ కనుకొని భారతదేశం ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. ఇందుకు గాను 1930లో నోబుల్ బహుమతి పొందారన్నారు. 1954లో భారత అత్యున్నత పురస్కారమైన భారతరత్న పొందడం జరిగిందన్నారు. ఇటువంటి గొప్ప శాస్త్రవేత్తలను నేటి విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ధృవపరిచిన రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు సి.వి.రామన్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు. యు.వి.సుజల, కళాశాల ఎవో జి.రమేష్‌బాబు, వివిధ విభాగాలధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త :** సైన్సే నా మతం, జీవితాంతం దానిని ఆరాధిస్తానని చెప్పిన విజ్ఞానఖని సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి పేర్కొన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో మంగళవారం ఆ మహనీయుని జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌లో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేధించి ప్రపంచ వినివీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ధృవ తార ఆ మహనీయుడే అన్నారు. వైజ్ఞానిక రంగంలో తొలిసారిగా నోబెల్ బహుమతి అందుకున్న కాంతి పుణ్యం అయనే అన్నారు. ప్రతిష్టాత్మక భారతరత్న అవార్డు కూడా సర్ సీవీ రామన్ పొందారన్నారు. సోవియట్‌యూనియన్ సైతం సర్ సీవీ రామన్‌ను లెనిన్ బహుమతితో సత్కరించారన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు కె. భారతి, టి. ఝాన్సీరాణి, ఈ. రాజేశ్వరి,విద్యార్థులు ఉన్నారు.

## రూ. 20 లక్షలతో సీసీ రోడు నిర్మాణానికి శంకుస్థాపన



**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని చిన్నపడు గుపాడులోని శ్రీనగర్ ప్రాంతంలో మంగళవారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడునడ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ లక్ష్మీ నారాయణ పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు. రానున్న రోజుల్లో పడుగుపాడు పంచాయతీలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో మరిన్ని రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీప డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, వార్డు సభ్యులు ఉన్నారు.

## రెండవ విడత వైఎస్సార్ రైతు భరోసా రూ. 3.94 కోట్లు

**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ రెండవ విడత సంబంధించి 3,94,74,000 రూపాయల నిధులు రైతుల ఖాతాల్లో మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బటన్ నొక్కి జమ చేయడం జరిగిందని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ కోవూరు మండలాలనికి సంబంధించి 3103 మంది రైతులు, కొడవలూరు మండలంకు సంబంధించి 4107, బుచ్చి మండలానికి సంబంధించి 3507, విడవలూరు మండలానికి సంబంధించి 4491, ఇందుకూరుపేట మండలానికి సంబంధించి 4535 మంది రైతులకు ఒక్కొక్కరికి 2 వేలు చొప్పున వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 19737 మంది రైతులకు రెండవ విడత ఈ నిధులు మంజూరయ్యాయన్నారు.

## పార్థివదేహానికి పోలంరెడ్డి నివాళులు

**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త** :చెర్లోపాలెం గ్రామం టీడీపీ సీనియర్ నాయకుడు నాగారెడ్డి శ్యామ్ సుందర్‌రెడ్డి చిన్నాన్న కోదండరామిరెడ్డి మంగళవారం మృతిచెందారు. ఈ మేరకు వారి పార్థివదేహానికి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి సమయంలోనే గుండె దిటవు చేసుకుని ధైర్యంగా ఉం దాలన్నారు. ఈ కార్యక్రమంలో లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నేతలు మహేష్, దయాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## ముసునూరు జగనన్న లేఅవుట్‌లో బయటపడ్డ డొల్లతనం



**కావలి రూరల్, నవంబరు 7 ప్రభాతవార్త** కావలి ముసునూరు జగనన్న లేఅవుట్ చిన్న వర్షానికే డొల్లతనం బయటపడుతుందని గృహాల లబ్దిదారులు వాపోతున్నారు. ఈ వర్షానికే బేస్ మట్టాలు కుంగుతున్నాయని తెలిపారు. గోడలు కూలిపడుతున్నాయని తెలిపారు. పేదలకు ఇచ్చే ఇళ్లలో నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తున్నారు. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గగ్గోలు పెడుతున్నా అధికారులు పెడచెవిన పెట్టారని తెలిపారు. జగనన్న మెగా లేఅవుట్ పర్యవేక్షణలో జిల్లా ఉన్నతాధికారులు శీత కన్ను వేశారన్న విమర్శలు వినవస్తున్నాయి.కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులే కాంట్రాక్టర్లు కావడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామి వారికి ఆల య ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వ ర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నాగవల్లిపత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికిపల్లకి



సేవకార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. రుత్వికులు సుబ్బ య్యస్వామి, నందకుమార్‌స్వామి, భక్తులు ఉన్నారు.

## మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి



**రాపూరు, నవంబరు7ప్రభాతవార్త** ఈ నెల 11వ తేది తెలంగాణా రాష్ట్రం సికింద్రాబాద్‌లో జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభనువిజయవంతం చేయాలని ఎమ్మార్పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య కోరారు. మంగళవారం రాపూరుమండల ప్రజాపరిషత్ కార్యలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994 జూలై 7వతేది ఈదుముడు గ్రామంలో ప్రారంభమైన ఎమ్మార్పిఎస్ ఉద్యమం నాటి దేశ ప్రథమ పౌరుడైన రాష్టపతి చేతులమీదుగా 1999లో షెడ్యుల్ కులాల వర్గీకరణ జరిగిందన్నారు.కోన్ని సాంకేతిక కారణాలతో దేశ అత్యున్నత న్యాయస్థానంవర్గీకరణను రద్దు చేసిందన్నారు. తరువాత 2018లో ఆదే అత్యున్నత న్యాయస్థానం వర్గీకరణ జరగాల్సిందేననిచెప్పిందన్నారు. ప్రపంచమంతా భారత దేశం మాదిగల వైపు చూసేలా ఉద్యమాలు చేసి మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడిన నాయకడుమందకృష్ణ మాదిగ అని ఆయన తెలిపారు.ఏస్సీ వర్గీకరణ జరిగితే ఎ కోద్దిమంది ఎమ్మార్పిఎస్ నాయకులకు కాకుండా మాదిగ ఉపకులాల అందిరికి ఉపయోగపడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ఈ మాదిగ విశ్వరూప మహాసభకుఅందరూ హజరై విజయవంతం చేయాలన్నారు. నెల్లూరు జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని,బాబూ జగజ్జీవన రామ్ భవంతిని కట్టాలని ఉద్యమం చేస్తున్న పందిరి సుబ్బయ్య నాయకత్వాన్ని తాము బలపరుస్తామనిరంగయ్య స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పిఎస్ మండల ఆధ్యక్షుడు మద్దూరి శ్రీనివాసులు, పట్టణఆధ్యక్షులు మాతంగి ప్రణయ్,విద్యార్ధి సంఘ నాయకుడు నవీన్, పలువురు ఎమ్మార్పిఎస్ నాయకులు వున్నారు.

## వాలంటీర్ పోస్టులకు ధరఖాస్తులు ఆహ్వానం

**రాపూరు,నవంబరు7ప్రభాతవార్త** రాపూరు మండలంలో ఖాళీగా వున్న రెండు వాలంటీరు పోస్టులకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల పరిషత్‌కార్యలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తెగచర్ల పంచాయితీలో ఒకవాలంటీరు పోస్టు బిసి మహిళకు, రాపూరు పంచాయితీల ఒకవాలంటీరు పోస్టు ఓసి జనరల్‌కు కేటాయించినట్లుతెలిపారు. జనవరి 1 2023 నాటికి 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని అభ్యర్థులుపదవ తరగతి పాసై వుండాలన్నారు. ఈ నెల 9వ తేది గురువారం వరకు ధరఖాస్తులు చేసుకోవచ్చని, 10వ తేది శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ప్రకటించడం జరుగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

## పల్లెకు పోదాం కార్యక్రమం ప్రారంభం

**ఆత్మకూరు,నవంబర్7,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "పల్లెకు పోదాం" కార్యక్రమం ఈనెల 9నుండి ప్రారంభమవుతుందని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వతేదీ న బట్టేపాడు సచివాలయంలో, 10న నువ్వురుపాడు సచివాలయం, 14న చెర్లో యడవల్లి సచివాలయం, లో సంక్షేమ బోర్డులను ఆవిష్కరిస్తారని ఎంపిడిఒ తెలిపారు. మధ్యాహ్నం3గంటల నుండి ప్రనజా ప్రతినిధులు,అధికారులు సచివాలయంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి సచివాలయాల ద్వారా అందజేస్తున్న సర్వీసులను గురించి వివరిస్తారన్నారు. కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వాలంటీర్లు, ప్రనజలు హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

## 6073 మందికి రైతు భరోసా నగదు జమ

**అనంతసాగరం,నవంబర్7,ప్రభాతవార్త :** మండలంలోని 6073 మంది పట్టాదారులైన రైతులకు రెండుకోట్ల నలభై ఊడు లక్షల రూపాయలు, 30మంది కౌలు రైతులకు నాలుగు లక్షల పదివేల రూపాయలు అందించారని మండల వ్యవసాయాధికారి కె.శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ రైతు భరోసా 2023-24 రెండవ విడత నిధులు విడుదల చేశారన్నారు. మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో ముఖ్యమంత్రి ప్రత్యక్షప్రసారాన్ని రైతులు , గ్రామ పెద్దలు వీక్షించారని ఆయన తెలిపారు.

## పేదలను ధనికులుగా మార్చడమే లక్ష్యం

**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** పేదలని ధనికులుగా మార్చడమే లక్ష్యంగా విజన్ 2047 లక్ష్యమని చంద్రబాబు అధికారంలో రాగానే ఆదిశగా పనిచేసేందుకు సమాయత్తం అవుతున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 46,47 డివిజన్ల పరిధిలోని చిన్నబజారు, గిడ్డంగి వీధుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని 47వ డివిజను అధ్యక్షుడు డాక్టర్ ధర్మవరం గణేష్‌కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తూనే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటికి గ్యారెంటీ ఇస్తూ ఉచితంగా మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తారన్నారు. వైసీపీ పాలనలో సమస్యల గురించి ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేస్తారని గుర్తుచేశారు. జగన్ వల్ల రాష్ట్రంలో దళితులు దారుణంగా హత్యలు, దాడులకు గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో పేద ప్రజలకు నాశిరకం మందులను పంపిణీ చేస్తున్నారని ధర్మవరం ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట భాస్కర్, అబ్దుల్‌రెహమాన్, సిద్ధకళాచారి, సాయిక్రిష్ణ, భవానిఅశోక్, కరమల ప్రభు, మాధవాచారి, అంగడి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది



బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని యూనిట్ ఇంచార్జి కొప్పలూరుమహేష్ అన్నారు.బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో కోనేటిమిట్టలో జరిగిన బాబుషూరిటి..భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు జాతీయ అద్యక్షులు నారాచంద్రబాబునాయుడు పిలుపు మేరకు, కోవూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆదేశాను సారం మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య నేతృత్వంలో క్లష్టర్2 ఇంచార్జి బండ్లకొండయ్య సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కడం తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని విమర్శించారు.ప్రస్తుతం వర్షా కాలంలో ప్రజలు రోడ్లపైన నడవలేక నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు.ఈకార్యక్రమంలో బూత్ ఇంచార్జి దొడ్ల కోదండరామిరెడ్డి, షేక్ మీరాబాయి, సంగులక్ష్మీనారాయణ, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలున్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**వరికుంటపాడు,నవంబర్ 7,ప్రభాతవార్త :** వరికుంటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ చేవూరి.శ్రీదేవి తెలిపారు.ఈ సమావేశంలో అన్ని శాఖల పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందనీ,కాబట్టి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ ల సర్పంచ్ లు,ఎంపిటిసి సభ్యులు,జెడ్పిటిసి సభ్యులు,అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలనీ ఎంపిడిఓ చేవూరి శ్రీదేవి కోరారు.

## వక్ఫ్‌బోర్డ్ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు

**అనుమసముద్రంపేట,నవంబర్7,ప్రభాతవార్త :**వక్ఫ్‌బోర్డ్ ఆస్తులు ఆక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్స్‌పెక్టర్ షేక్ ఖుదావన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఏఎస్‌పేటలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ మండలంలోని హసనాపురంలో వక్ఫ్‌బోర్డ్ కు సంబంధించిన ఆషూర్‌ఖానా



స్థలం సర్వే నెంబర్ 425లో 3-61 ఎకరాల భూముల్లో కొందరు అక్రమ దారులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేప డుతుండగా పరిశీలించానన్నారు. వక్ఫ్ బోర్డ్ స్థలాల్లో అక్రమ కట్టడాలు కట్టరాదని ఆక్రమణ దారులను హెచ్చరించారు. ఇదే క్రమంలో ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్లో ,తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వక్ఫ్‌ఇన్స్‌పెక్టర్ తెలిపారు. అక్ర మదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని వక్ఫ్‌స్థలాల్లో అక్రమకట్టడాలను స్వతహాగా తొలగించుకోవాలన్నారు. లేని పక్షంలో తామే పోలీస్, రెవెన్యూ సహకారంతో తొలగించేస్తామన్నారు. అలాకాదని వ్యవహరించిన వారిపై వక్ఫ్‌చట్ట ప్రకారం కేసులు పెడతామన్నారు.

## అనారోగ్య బాధితులకు కాకర్ల ఆర్థికసాయం



**వింజమూరు,నవంబర్7,ప్రభాతవార్త :** వింజమూరు పట్టణంలోని యాదవబజారులో అనారోగ్య బాదితులకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు కాకర్ల సురేష్ బాధిత కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించారు. మంగళవారం వింజమూరు యాదవబజార్‌లోని ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిన డేగా నర్సింహారావ్, పక్షవాతం బాధపడుతున్న జాజుల రమేష్‌లను స్వయంగా వారి నివాసాలకు కాకర్ల వెళ్ళి వారిని పరామర్శించి ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాల్లో మనోధైర్యాన్ని నింపారు. ఇల్లుకోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న షేక్ మస్తాన్‌కు 10వేల రూపాయలు అందజేశారు. మాజీ ఎంపిటిసి సభ్యురాలు మారెళ్ళ సంపూర్ణమ్మ ఇంటికి వెళ్ళి రాజకీయ సమాలోచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి కొరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ నిరంతరాయంగా సేవలంది స్తుందన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులుయాదవ్, మారెళ్ళ వెంకటేశ్వర్లు, జిల్లేల్ల శ్రీనివాసులు, బాదుల్లా, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు బాణాసంచా విక్రయాలు చేపట్టాలి

**వింజమూరు,నవంబర్7,ప్రభాతవార్త :** వింజమూరు పట్టణంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని టపాకాయల విక్రయదారులు లైసెన్సు కలిగి నిబంధనల మేరకు బాణాసంచా విక్రయాలు చేపట్టాలని వింజమూరు ఎస్ఐ కోటిరెడ్డి పేర్కొన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచాను విక్రయిస్తే సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హెచ్చరికలు చేశారు. వింజమూరు పట్టణంతోపాటు పంచాయతీపరిధిలో కూడా అనుమతి లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసినా , విక్రయాలు జరిపినా అటువంటివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని అనుమతులు తీసుకొని దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. తోపుడు బండ్లపై ఉంచి టపాకాయలను విక్రయించరాదన్నారు. ప్రతి షాపుకు మధ్య సమదూరం ఉండేలా చూడాలన్నారు. వాటర్ డ్రమ్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. స్థానిక తహసిల్దార్, అగ్నిమాపక , పోలీస్ లు సూచించిన ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చూడాలన్నారు .

## రీసర్వే వలన రైతుల సమస్యల పరిష్కారం

**చేజర్ల,నవంబర్7,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీసర్వే కార్యక్రమం రైతుల సమస్యల పరి ష్కారానికి ఎంతో మేలు చేస్తుందని తహసిల్దార్ పి.కృష్ణ తెలిపారు. ఈసం దర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మా ట్లాడుతూ ప్రస్తుతం రీసర్వే మండల పరిధిలోని పాడేరు, కాకివాయి గ్రామాల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఏడు గ్రామాల్లో భూములకు సంబం ధించి రీసర్వే పూర్తి చేశామన్నారు. మొదట ఆయా గ్రామాల్లో దండోరా వేయిం చి గ్రామ సభ నిర్వహించామన్నారు. గ్రామ సభలో భూములకు సంబంధించి రైతులు రెవెన్యూ అధికారులకు



వివరాలు ఇవ్వాలన్నారు.రైతులు సకాలంలో అందుబాటులో ఉండడంతోపాటు తగిన పత్రాలు తమ దగ్గర ఉండేలా చూసుకోవాలన్నారు. అదే విధంగా శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంలో రైతుల భూములను సర్వే చేయించుకొని రైతులు భూ హక్కు పత్రాలు పొందాలని కోరారు.

## 4 వాలంటీర్ పోస్టులు

**వలేటివారిపాలెం నవంబరు 7, ప్రభాతవార్త** మండలంలోని ఖాళీగా ఉన్న 4 వాలంటీర్‌పోస్టులు ఈ నెల 9వతేదీలోప ఆన్‌లైన్ ధరఖాస్తుచేయాలని స్థానిక ఎంపీడీవో షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు. అర్హులైన వారికి ఈ నెల 10న ఇంటరూ ్వ్యలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. చుండిలో 1,లింగపాలెం 1,శాఖవరం 1చొప్పున ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. కనీసం 10వతరగతి/ఇంటర్ అర్హతగలిగిన సేవాభావం గలిగిన స్థానికులే ధరఖాస్తుచేయాల్సిందిగా ఆయన సూచించారు.

## 9నుంచి మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం

**వలేటివారిపాలెం నవంబరు 7, ప్రభాతవార్త** మండలంలోని సచివాలయాల పరిధిలో ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మానమ్మకం నువ్వేజగనన్న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఫీక్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారదులు, వాలంటీర్లు, సంబందిత మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.9న వలేటివారిపాలెం, 10న బడేవారిపాలెం, 14న పోకూరు, 15న చుండి, 16న అయ్యవారిపల్లె,17న కలవళ్ల, 20న శామీరపాలెం, 21న అంకభూపాలపురం,22న కొండసముద్రం, 23న పోలినేనిపాలెం సచివాలయాల్లో మద్యాహ్నం 3గం॥ నుంచి సాయంత్రం 5గం॥ల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

## నలంద టాలెంట్ పాఠశాలలో ఘనంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎక్సిబిషన్



**కావలి, నవంబరు 7 ప్రభాతవార్త** కావలి నలంద టాలెంట్ పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎక్సిబిషన్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్ భాష విశిష్టతను, దాని అవసరాన్ని , అది మన జీవితంలో ఎలాంటి పాత్రను నిర్వహిస్తుందో తెలిపే విధంగా విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నలంద విద్యాసంస్థల చైర్మన్ యం.డి.మజహర్ మాట్లాడుతూ ఇంగ్లీష్ భాషను సులువుగా ఎలా నేర్చుకోవాలో తెలిపే విధానాలు ఎంతగానో ఆకట్టుకునేలా వున్నాయన్నారు. నలంద విద్యాసంస్థల డైరెక్టర్లు యం.డి.వసీమ్, యం.డి.ఫహీంలు మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్ వారిలోని భావాలను, సృజనాత్మకతను వెలికి తీసేలా వున్నాయన్నారు. వీరిని ప్రోత్సహించిన పాఠశాల ప్రిన్సిపాల్‌కి, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్‌కి, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మెహర్‌తాజ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌కు సంబంధించిన పలురికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో వాటిని పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వివిధ కేసులకు సంబంధించి ముద్దాయిలను సకాలంలో అరెస్టు చేసి వారిని కోర్టుకు హాజరుపరిచేలా దృష్టి పెట్టాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీలు పెంచి దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రషీద్, వేణు, తదితరులు ఉన్నారు.

## ఎమ్మార్సీలోకి వెళ్లాలంటే.. పడవ ప్రయాణం తప్పదా ?



**కోవూరు, నవంబరు7ప్రభాతవార్త :** కోవూరు మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి పలు ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. మండల పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న రహదారులు పూర్తిగా జలమయమయ్యి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న ఈ వర్షాలు రైతులకు మేలు చేసే విధంగా ఉండడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తాలూకా కార్యాలయం ప్రాంగణంలో ఉన్న మండల విద్యావనరుల కేంద్రం రహదారి ఈ వర్షానికి పూర్తిగా జలమయమైంది. దీంతో కార్యాలయానికి వెళ్లాలంటే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయంలోకి వెళ్లాలంటే పడవ వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఉపాధ్యాయులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు

**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** ఎవరైనా అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమంగా వారిపై కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తున్నారని, రాష్ట్రంలో అరాచకపు పాలనకు ఇదొక నిదర్శనమని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 6వ డివిజను జీనిగలవారి వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ, మాట్లాడుతూ జగన్‌కి అభివృద్ధి అంటే ఏమిటో తెలియదన్నారు. అభ్యున్నతి అనేది లేకపోతే రాష్ట్రం మరో శ్రీలంకగా మారిపోతుందన్నారు. జగన్ టీడీపీని లేకుండా చేయాలని చూస్తున్నాడని, ఈ జన్మకి అది జరగదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడని జగన్‌కి అవకాశం ఇస్తే, సర్వనాశనం చేశాడని వారు విమర్శించారు. నగరం అభివృద్ధి చెందాలంటే నారాయణ గెలవాలని అబ్దుల్‌అజీజ్, శ్రీనివాసులురెడ్డిలు అన్నారు. అనిల్ అవినీతికి సిద్ధమాని ఛాలెంజ్ చేశారు. వైసీపీ నాయకులే ఈసారి టీడీపీ గెలుస్తుందని అనడం సంతోషకరమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు, కువ్వారపు బాలాజీ, నియోజకవర్గ పరిశీలకులు కరిముల్లా, తాళ్లపాక అనూరాధ, ప్రశాంత్, కొండ ప్రవీణ్, గుత్తా అన్నపూర్ణ, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి కార్యకర్తలే ఆయువుపట్టు

**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఆయువుపట్టని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. మంగళవారం నగర నియోజకవర్గంలో పలుచోట్ల ఆయన, జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు కార్యకర్తలను కలి శారు. ఆయా ప్రాంతాల్లోని నాయకులు, కార్యకర్తలు వారికి ఘనంగా స్వాగతం పలుకుతూ, వారికి శాలు వాలు కప్పి, పూలమాల బొక్కేలు ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన నాయకులు బాలాజీ నగర్‌లో అబ్దుల్‌సుబహాన్, ఎన్టీఆర్ నగర్‌లో బాలకోటేశ్వరావుల నివాసాలకు వెళ్ళి కలిసి మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రధాన సమస్యలపై వారితో చర్చించారు. డివిజన్ పరిధిలోని ఓటరు జాబితాపై సర్వే చేయాలని వారికి నారాయణ సూచించారు. రానున్న ఎన్నికల్లో ఓ ప్రణాళిక ప్రకారం కలిసికట్టుగా పనిచేసి టీడీపీ అధికారంలోకి వచ్చేలా శక్తివంచన లేకుండా పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు, షేక్ కరిముల్లా, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, తాళ్ళపాక అనూరాధ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌అజీజ్‌కి నోటీసు ఇచ్చిన ఎస్సై సుబహాని

**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్, సీఐ రాములు నాయక్‌కు వాగ్వివాదం జరగడంతో గతంలో అజీజ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విషయం విధితమే, ఈ మేరకు మంగళవారం నగరంలోని హరనా థపురంలోని అబ్దుల్‌అజీజ్ నివాసంలో ఆయనకు 6వ పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై సుబహాని నోటీసును అందించారు. నోటీసులో నాయక్ ఫిర్యాదు మేరకు పిఓఏ యాక్ట్ ఐసీపీ సెక్షన్ 290, 353,3(1)(ఆర్)(ఎస్) కింద కేసు నమోదు చేసినట్లు బాలజీనగర్ పోలీసులు అబ్దుల్‌అజీజ్‌కి 41(ఏ) సీఆర్పీసీ నోటీసును అందచేశారు.

## జొన్నవాడ కామాక్షితాయి హుండి లెక్కింపు



**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో మంగళవారం హుండి లెక్కింపు నిర్వహించారు.16.8.2023 నుండి 07.11.2023 వరకు 84 రోజులకు గాను హుండి లెక్కింపు నిర్వహించడం జరిగిందని అన్నారు. హుండి లెక్కించగా 45,66,929 రూపాయాలు రాగా సింగపూర్ డాలర్స్ 10,లండన్ (ఇంగ్లాండ్) పౌండ్స్ 20 బంగారు వస్తువులు 185 గ్రాములు,వెండి వస్తువులు 383 గ్రాములు 100 మిల్లీ గ్రాములు భక్తులు శ్రీవార్ల హుండి ద్వారా సమర్పించినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.ఈకార్యక్రమంలో దేవస్ధానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు,దేవస్ధాన సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి విరుపార్జుల గిరికృష్ణ, పాలక మండలి సభ్యులు, పర్యవేక్షిణాధికారిగా డి .చంద్రశేఖర్‌రావు, సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీవేణుగోపాలస్వామి దేవస్ధాన మూలపేట, స్ధానిక ఏపిజిబి బ్యాంకు అధికారులు, అప్రైజర్ ఆలయ సిబ్బంది. పోలీసులు, విద్యాసాగర్ కృష్ణ ఆద్వర్యంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలలే నీ భాగోతం ...లెక్కలన్ని తీస్తాం



**జలదంకి,నవంబర్ 7,ప్రభాతవార్త :** ఉదయగిరి ఎమ్మెల్యేలు గా నేను,మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి లు ఏనాడు ఒకరి మీద ఒకరూ కేసులు పెట్టుదాఖలాలు లేవు,వైసిపి కి నువ్వు వచ్చి పట్టుమని పది రోజులు కూడా కాలేదని,21 మంది పై కేసులు పెట్టిస్తావా,ఇంక్కెంత నాలుగు నెలలే నీ భాగోతం ,వచ్చేది టిడిపి ప్రభుత్వం మే అందరూ లెక్కలు తీస్తాం,మమ్ములను ఇబ్బంది పెట్టిన వారెవ్వరిని వదలిబెట్టబోమని టిడిపి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొల్లినేని వెంకటరామారావు వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ని హెచ్చరించారు.జలదంకి టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి రాజగోపాల్‌రెడ్డి తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయగిరి లో అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారనీ మండిపడ్డారు.ఏ హోదాలో సచివాలయాలను ప్రారంభిస్తున్నావు,శిలాఫలకాలపై పేరు ఏలా వేయించుకుంటున్నావు,పోలీస్ ఎస్కార్ట్ నీకు ఎందుకు,ఆ మధ్య ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన తహశీల్దార్ ను నోటికి వచ్చినట్లు ఏలా మాట్లాడుతావ్ అని ప్రశ్నించారు.ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తావా అనీ అన్నారు.మేము సంబరాలు కూడా చేసుకుంటానికి లేదా పొలిటికల్ ప్రజర్ తో అధికారుల మీద వత్తిడి తెచ్చి ఈ విధమైన పోకడలకు పాల్పడతావా అనీ మండిపడ్డారు.దీనిని మేము పూర్తిగా ఖండిస్తున్నామనీ అన్నారు.వైసిపి నాయకులు అవినీతిక జిల్లాలో అడ్డు అదుపులేకుండా పోయిందనీ ఆరోపించారు.జామాయిల్ తోటలు,వేలం లేకుండా దాదాపు నాలుగు లక్షల టన్నుల క్వాంటిటీ ని దోచుకున్నారనీ ఆగ్రహించారు.లక్ష ఎనభైవేల టన్నులకు పాట పాడి మిగతా,రెండు లక్షల ఇరవై వేల టన్నులు ఉచితంగా బొక్కారనీ సంచలన కామెంట్స్ చేశారు.ఇది పెద్ద స్కాం అనీ బొల్లినేని ఆరోపించారు.ఉదయగిరి నియోజకవర్గంలో ఈ తోటలు ఎక్కువ అనీ ప్రస్తుత మార్కెట్ రెటు 7 వేల రూపాయలు ఉంటే ఎవ్వరిని టెండర్లు వేయనీయకుండా బెదిరింపులకు పాల్పడి 3వేల 4 వందల తక్కువ రేటు కు వైసిపి వారే పాడుకోని 3 వందల కోట్ల స్కాం కు పాల్పడ్డారన్నారు.మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి అనుచరులు దీనికి పాల్పడ్డారనీ అన్నారు.టిడిపి హయంలో నాలుగు వేల ఒక్క వంద కోడ్ చేస్తే రేటు తక్కువనీ మా ప్రభుత్వం రద్దు చేసిందనీ గుర్తు చేశారు.అంతే కాకుండా రైతుల పేర్లు రికార్డుల్లో నమోదు చేసి,గేదెల స్కాం కు పాల్పడిన ఘనత వైసిపి వారిదన్నారు.ఈ స్కాంలో రెండు వేల ఎనిమిద వందల కోట్ల రూపాలయను తిన్నారన్నారు.అలాగే ఇసుక ,మట్టి చివరకు మందు స్కాంకు కూడా మీరు పాల్పడ్డారనీ వివరించారు.ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారనీ రాబోవు సాధారణ ఎన్నికల్లో బుద్ధి చెప్పెందుకు సిద్దంగా ఉన్నారనీ జోస్యం చెప్పారు.ప్రభుత్వ వైఫల్యాలను తమ పార్టీ కార్యకర్తలు, నాయకుల ,జనసేన వారు సంయుక్తంగా గ్రామాలకు వెళ్ళి వైసిపి అన్యాయాలను వివరిస్తామనీ తెలిపారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పులిగుంట మధురెడ్డి,సీనియర్ నాయకులు ఒంటేరు జయచంద్రారెడ్డి ,పూనురు భాస్కర్ రెడ్డి,కంచెర్ల వినోద్ నాయుడు .పచ్చా పెంచల నాయుడు,మాదిరెడ్డి సుబ్బారెడ్డి,ఉన్నం రవి ,మట్టేపు కొండలరావు,కొత్తపాళెం వెంకటేశ్వర్లు రెడ్డి ,జాదుల శివరామయ్య,ఏగూరి రఘు,అన్ని పంచాయతీ ల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరాచకాలతోనే వైసీపీ పార్టీ పునాదులు



**నెల్లూరు నవంబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని 6వ డివిజనులో టీడీపీ మాజీమంత్రి పొంగూరు నారాయణ మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో అబ్దుల్‌అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ వైసీపీ పార్టీ అరాచకాలు, దుర్మార్గాలతోనే దానికి పునాదులు పడ్డాయని ఆరోపించారు. వైసీపీ కాలు పెట్టిన చోట వినాశనం తప్ప అభివృద్ధి లేదన్నారు. టీడీపీని లేకుండా చేయాలన్న ఆలోచనే ఒక మూర్ఖపు ఆలోచనన్నారు. టీడీపీకి బూత్‌స్థాయిలో బలమైన సైన్యం ఉందన్నారు. టీడీపీ పునాదులు లేకుండా చేయడం ఎవరితరం కాదన్నారు. ఒక్కఛాన్సు పేరుతో ఐదుకోట్లమంది ప్రజల జీవితాలు, ప్రజా వ్యవస్థలను నాశనం ఘనుడు జగన్ అని మండిపడ్డాడు. ప్రజలిచ్చిన సువర్ణ అవకాశాన్ని మూర్ఖత్వంతో దుర్వినియోగం చేస్తున్న ఏకైక సీఎం జగన్ అని అన్నాడు. వీరి చరిత్ర మొత్తం పాపాల పుట్టని అయినా పెద్దమనస్సుతో ప్రజలు గెలిపించారన్నారు. కుట్రపూరిత రాజకీయాలతో నాపై అట్రాసిటీ కేసు నమోదు చేశారని విమర్శించారు. నాకు ప్రజాస్వామ్యపై నమ్మకం ఉన్నవ్యక్తినని, నేను కులం పేరుతో దూషించాల్సిన అవసరం నాకు లేదని, నేను విద్యావంతుడనన్నారు. సంస్కారహీనుడిని కాదన్నారు. మహిళలని వారి హ్యాండ్ బ్యాగ్లను గేటు బయటపెట్టి రమ్మని చెప్పిన పోలీసులకు ఇది సరైన పద్ధతి కాదని చెప్పానని దానికి నాపై కులం పేరుతో ధూషించానని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఇదంతా చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాష్ట్రంలో నియంతపాలన నడుస్తోందో అర్ధం కావడం లేదన్నారు. వైసీపీ తాటాకు చప్పుళ్ళకు తాను భయపడేది లేదని, ఇప్పటికే నాపై అనేక అక్రమ కేసులు పెట్టారని కేసులేమీ తనకు కొత్తమే కాదని, తనకు వీటిని ఎదుర్కొనే శక్తి భగవంతుడు నాకు ఇచ్చాడన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డిని సత్కరించిన పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు



**నెల్లూరు సిటీ, నవంబరు 7 ప్రభాతవార్త** వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం కావలికి చెందిన పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి వారు తీసుకొచ్చారు. కావలిలో స్మశాన స్థలం చుట్టూ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో పాటు మరో ఐదు ఎకరాలు క్రిస్టియన్లకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కావలి పట్టణంలో క్రిస్టియన్ కమిటీకి సంబంధించి హాలు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల ఏసుబాబు, కోఆర్డినేటర్ పాడేటి థామస్, సభ్యులు పాల్గొన్నారు.

## వెంటనే మదన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు అర్బన్ నవంబర్ 7, ప్రభాత వార్త** రూరల్ నియోజకవర్గంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వారిని దుర్భాషలాడిన నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డిపై తక్షణమే కఠిన చర్యలు తీసు కోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్ జిల్లా రెవెన్యూ అధికారి మలోలకి ఆయన ఛాంబర్‌లో వినతిపత్రం అందించారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని అనేకసార్లు అధికారులను కలిశామని ఆయన తెలిపామన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలో 28 డివిజను సచివాలయంలో అధికార పార్టీ నేతలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి మా బంధువు జగన్‌రెడ్డి నన్ను నియమించాలని వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి బెదిరిస్తున్నారని డీఆర్వోకి చెప్పారు. ఐపాక్ టీం చెప్పిందే వినాలి, నేనే చెప్పిందే వినాలని ఎన్నికల నియమావళి విషయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు మదన్‌మోహన్ చూడవచ్చని ఆయనకు చెప్పారు. గతంలో రాజరాజేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో దర్శనానికి వచ్చిన మహిళా భక్తులపై అసభ్యకరంగా ప్రవర్తించడన్నారు. ఆయన వెంటనే చర్యలు తీసుకోకపోతే టీడీపీ ఆధ్వర్యంలో పోరాటలకు దిగుతామన్నారు.

## బుచ్చిరెడ్డిపాలెంకి 132 కెవి సబ్‌స్టేషన్ మంజూరు
## ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌కి కొత్తగా 132 కెవి ఇహెచ్‌టి సబ్‌స్టేషన్ మంజూరు కావడం జరిగిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు.మంగళవారం సబ్‌స్టేషన్ వద్ద స్ధలం పరిశీలించిన సందర్బంగా ఆయన మాట్లాడుతు అతి త్వరలో సబ్‌స్టేషన్ పనులు చేపడతారని ఆయన తెలిపారు. బుచ్చి ,సంగం తదితర మండలాలకు ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల నాణ్యమైన విద్యుత్ ఎటువంటి అంతరాయం లేకుండా వస్తుందని అన్నారు.సమ్మర్ సీజనలో హెచ్చతగ్గులో వోల్టేజి రాకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని పేర్కున్నారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల 40 సంవత్సరాలు ఎంత లోడు పెరిగినా వోల్టేజి సమస్య ఉండదని అన్నారు. ఈ సబ్‌స్టేషన్ లోడు సరపరా పూర్తి స్ధాయిలో చేస్తుందని తెలిపారు.ఈకార్యక్రమంలో నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, ఇప్పగుంట విజయ్‌బాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి మోర్ల మురళీ, ఇఇ కె. విజయ్‌కుమార్‌రెడ్డి,డిఇఇ ,శీనయ్య,ఎఇ రూరల్ సురేష్‌బాబు ,పలువురు వైసిపినాయకులు పాల్గోన్నారు.

## పొదుపు గ్రూప్‌లకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుంది



**బుచ్చి నవంబర్ 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని రామచంద్రాపురం గ్రామంలో స్లంసమాఖ్య సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా నగర్ చైర్‌పర్సన్‌మోర్ల సుప్రజ వ్యవహారించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు పొదుపు మహిళకు జగనన్న ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు 20 వ వార్డులో జరుగుతున్నటువంటి రామచంద్రాపురం సమాఖ్యలో ఉన్న మొత్తం గ్రూప్‌లు 3,వైఎస్‌ఆర్ ఆసరా ఇచ్చిన గ్రూప్‌లు 23,సున్నావడ్డి వచ్చిన గ్రూప్‌లు 28, జగనన్న తోడు ఇచ్చిన సభ్యులు 31 మందికి పదివేల రూపాయాలు వంతున 3 లక్షలా 10 వేల రూపాయాలు ఇవ్వడం జరిగిందని సెల్‌హెల్ప్‌గ్రూప్‌లో ఉన్న సంఘాలన్నీ ఎ గ్రేడ్‌లో ఉన్నందున ఎస్‌ఎల్‌ఎఫ్ కూడా ఆదాయంలో ఉన్నాయని వివరించారు. 20 వవార్డు కౌన్సిలర్ కత్తి శ్రీదేవి, మెప్మా సిఓ నర్మద, ఆర్‌పి పద్మ, వైసిపినాయకులు పెంచలయ్య, పొదులపు సంఘాల గ్రూప్‌లు పాల్గోన్నారు.

## ఉపాదిహామీ లో రికవరీ 42,665రూపాయలు



**వింజమూరు,నవంబర్7,ప్రభాతవార్త :** వింజమూరు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకం ద్వారా 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు జరిగిన పనులకు సంబంధించి మంగళవారం నిర్వహించిన సామాజిక బహిరంగ చర్చావేదికలో 42,665రూపాయలు రికవరీగా నిర్ధారించినట్లు ప్రిసైడింగ్ అధికారి సుజాత తెలిపారు. ఈసందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వింజమూరు మండలంలో గత నెల 28నుండి ఈనెల 4వ తేదీ వరకు సామాజిక తనిఖీ చేసిన నివేదికలను మంగళవారం చర్చావేదికలో చర్చించారన్నారు. మండలంలోని 12పంచాయతీల్లో 448పనులు చేపట్టగా అందుకు 8కోట్ల 30లక్షలా 11వేలా 62రూపాయలు ఖర్చు చేసినట్లు వాటిలో వేతన రూపంలో 6కోట్ల, 95లక్షలా, 56వేల 61రూపాయిలు చెల్లింపులు జరిగినట్లు తెలిపారు .జాతీయగ్రామీణ ఉపాదిహామీ పథకం ద్వారా 49పనులు కాగా పంచాయతీరాజ్ పనులు 37,నీటివనరుల శాఖ కు సంబంధించిన ప్రహరీగోడకు సంబంధించి 12పనులు జరిగాయన్నారు. ఈపనులపై ఎస్ఆర్‌పిల ఆధ్వర్యంలో పిఆర్‌పిల బృందం సమగ్రమైన తనిఖీ నిర్వహించారు. 22-23 సంవత్సరంలో జరిగిన పనుల తనిఖీలు పారదర్శకంగా నిర్వహించామని ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో కొన్ని లోపాలను గుర్తించామన్నారు. కొలతలు తీయడంలో లోపాలు తదితర చిన్న చిన్న లోపాలు న్నాయన్నారు. వాటిని రికవరీ రూపంలో ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, క్వాలిటీ కంట్రోల్ ఇఇ వేణుగోపాల్, ఎపిడి ఆర్.గాయత్రీదేవి, ఎపిఎం నాగరాజు, ఉపాదిహామీ సిబ్బంది, అన్ని పంచాయతీల ఉపాదిహామీ కూలీలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



**సైదాపురం, నవంబర్ 7, ప్రభాతవార్త** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలతలుపూరు సచివాలయం పరిధిలో ఉన్న చెర్లోపల్లి, ఓరుపల్లి గ్రామాల్లో రెండో రోజు మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్తూ ఆయా కుటుంబ సభ్యులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్‌ను లబ్దిదారులకు అందించారు. గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వెంటనే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన లబ్దిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయాధికారిణి హైమావతి, ఏపీఎం రాధమ్మ, మండల వైసీపీఅధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాస్ రాజు, నాయకులు వెంకటయ్యనాయుడు, శ్రీకాంత్‌చౌదరి, రామ్‌గోపాల్‌రెడ్డి, అభిరాజు, వివేక్ రెడ్డి, మోహన్‌రావు, సుబ్బారెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.